# బలం

రామం, రఘు, స్వప్న, అరుణలు వొకేవూరివారు. యూనివర్శిటీలో ఫ్రెండ్స్ అయ్యారు. స్వప్నకు రామం అంటే యిష్టం, రఘు అరుణను ప్రేమిస్తున్నాడు. వేర వేరు అభిరుచులు, అభిప్రాయాలు, దృక్పధాలు కలిగిన నలుగురిని కలిపి ఉంచగలిగిన బంధం ఒక్కటే, ఇంటెలిజెన్స్. వారివారి ఫెకల్టీస్‌లో ఆనలుగురే ఫస్ట్.

చదువుతో విసిగిపోయినప్పుడు నలుగురూ కల్సి జాతీయ అంతర్జాతీయ సమస్యల్ని చర్చిస్తుంటారు. అదివారి కున్న మంచిహాబీలలో వొకటి.

ప్రస్తుతం కాశ్మీర్, పంజాబ్‌లలో వున్న పరిస్థితుల దృష్ట్యా దేశరక్షణకు అత్యంత అవసరమైన చర్యేమిటన్నది ఆరోజు చర్చకు వచ్చింది.

'ఆయుధాల పెంపుదల' అంటూ స్టాటిస్టిక్స్‌తో సహా విశ్లేషించాడు రఘు.

'సుస్థిర రాజకీయ వ్యవస్థ' స్వప్న అభిప్రాయం అది.

'సామాజిక మార్పు, విప్లవం' అంటూ అరిచింది అరుణ. యీ మధ్య ఆ అమ్మాయికి విదేశీ ఎరుపు అంటుకొంది. యూనివర్శిటీ గోడలపై పిచ్చిరాతలు ఆమెకు కంఠతావచ్చేసేయి.

రామం నలుగురి అభిప్రాయాలని శ్రద్ధగావిన్నాడు. కానీ మాట్లాడలేదు.

అతని ప్రత్యేకత అదే. చాలా డీప్ మనిషి. సమస్యలపట్ల చాలా లోతైన అవగాహనవున్నవాడు. అయినా ఎక్కువగా మాట్లాడడు. ఆచరణకు ప్రాధాన్యతనిస్తాడు.

'నీ అభిప్రాయాన్ని చెప్పవేం?' ముగ్గురూ అతనినడిగారు.

'వొక స్త్రీ, పులినోట్లో వున్న మేకను లాక్కుందని చెప్తే మీరు నమ్ముతారా? ఆపులిని తరిమి తరిమి కొట్టిందంటే విశ్వసిస్తారా?'

'ఇంపాజిబుల్'

'కానీ అది నిజం'

'అయితే ఆ కథేదో చెప్పు వింటాం'

'కానీ మనచర్చనీయ అంశానికి యీ కథకూ సంబంధం ఏమిటి?' అరుణ ప్రశ్నించింది.

'కథ విన్నాక కదా ఆవిషయం తెలిసేది. ఏ సంబంధం లేకపోతే రామం ఆ ప్రశ్ననెందుకు లేవనెత్తుతాడు?' స్వప్న రామాన్ని సపోర్ట్ చేసింది.

కాస్సేపు ఆగిరామం మెల్లగా కథచెప్పటం ఆరంభించాడు.

✡ ✡ ✡

సీలేరు ప్రాంత అడవుల్లో వొకగూడెం . అక్కడ జనజీవితం నిన్న మొన్నటి దాకా ప్రశాంతంగా ఉండేది. అయితే తొలుత వ్యాపారులు, ఆతర్వాత భూస్వాములు, కంట్రాక్టర్లు,

ప్రభుత్వ యంత్రాంగం, యీ మధ్య విప్లవ నినాదాలు చేసే అల్లరి మూకలు అక్కడికి చేరి కలుషితం చేసాయి. అయినా ఆ గూడెం తన మౌలిక సంప్రదాయాలను, సంస్కృతిని పూర్తిగా కోల్పోలేదు.

సంవత్సరానికొక్కసారి గ్రామదేవతలకు సంబరం జరుపుకోటం ఆగూడెంలో ఎప్పటి నుంచో వస్తున్న ఆచారం. ఆ ఆచారం చుట్టూ అనేక విశ్వాసాలు అల్లుకోబడివున్నాయి. కొత్త ధోరణులు ఎన్నివచ్చినా ఆపాత విశ్వాసాలు చెక్కుచెదరలేదు.

అమ్మోరికి మేకపోతును వేటగా యిస్తానని నూకాలమ్మ మొక్కుకుంది.

భర్త వీరన్నను మేకను కొని తెమ్మని పోరు పెడ్తోంది రోజూ.

గూడేనికి పక్కనున్న గ్రామంలోని భూస్వాములు తమ ఆవులమందలను, మేకల మందలను మేపమని గూడెంలో వారికిస్తారు.

వీరన్న కూడా అలాంటి మందలను మేపుతుంటాడు.

మందలో వొక మేకను భార్యకివ్వలేడు.

మందలోని వొక్క మేకగాని, ఆవుకాని పోతే భూస్వామి నష్టపరిహారంగా ప్రోనోటు రాయించుకుంటాడు. వాళ్లశ్రమ శక్తిని దోచి పారేస్తాడు.

ఆ భయం వల్ల మందల్ని కన్నుల్లా చూచుకొంటారు గిరిజనులు.

'ఏటల్లేదు గీటల్లేదు వూరుకోయే. మేకని కొనటమంటే మాటలా? అయినా అసలు అమ్మోరే లేదని సదువుకున్నోళ్లు రోజు అరనసిసెప్తావుంటే యిక సంబరాలేంది - ఏట లేందే?'

యీరన్నకు యీ మధ్యనే విప్లవగుంపు మాటలు మెదడుకు కాస్త కాస్త అంటుకొన్నాయ్. ప్రతిదానికి ఎడ్డెమంటే తెడ్డమంటున్నాడు.

'సేతకాకపోతే సేతకాదని సెప్పరాదూ? ఎదవ మాటలెందుకు? నేనేమంత సేతకాని దానినను కొన్నావా. మేకను నేనే సంపాదించుకొంటాన్బ్బాడు.'

అన్నట్లుగానే కష్టపడి డబ్బు కూడబెట్టి సంతకు పోయి మేకను కొనుక్కొచ్చింది నూకాలమ్మ. దాన్ని జాగ్రత్తగా మేపి పుష్టిగా తయారు చేసింది.

'ఏంటే నీ పిచ్చి?'

"సాల్లే ఊరుకో, కళ్ళు పేలిపోతాయి. యిప్పుడది నీ మందలో మేకలాంటిది కాదు. అమ్మోరికి వుపయోగపడుతున్న పున్నేతుమురాలు."

✡ ✡ ✡

రేపే సంబరం.

అప్పటికి నాలుగు సార్లున్నా లేచి మేకను చూచుకొని వచ్చింది నూకాలు.

పుష్టిగా, అందంగా వుంది మేక. మొహాన పసుపుకుంకుమ పెడ్తే అచ్చం అమ్మోరిలాగే మెరిసిపోతోంది.

గూడెంలో వారికళ్లన్నీ ఆ మేకపైనే వున్నాయి. అందరూ వేటను అంత జాగ్రత్తగా పెంచి తయారుచేసినందుకు నూకాలును పొగిడేరు.

నూకాలుకు కూడా యిన్నాళ్లకు తనకోరికి తీరబోతున్నందుకు ఆనందంగా వుంది.

యింత మంచి మేకను ఏటగా యిస్తే అమ్మోరు ఎంతగా సంతోషిస్తుందో? తనకోరికల్ని వెంటనే తీర్చదా?

నూకాలుకు బిడ్డల్లేరు. అమ్మోరు దయ తల్చి తన్ని తల్లిని చెయ్యాలి. అది ఆమె మొదటి కోరిక.

యీరన్న యీమధ్య చెడుసావాసాలు చేసి సెడిపోతున్నాడు. పిచ్చిపిచ్చి మాటలు మాట్లాడుతున్నాడు. అతను మళ్లా మామూలు యీరన్న కావాలి.

వర్షాల్నే కురిపించగల అమ్మోరికి యివో లెక్కా?

యీరన్న మామూలు మనిషవుతాడు. తనుతల్లవుతుంది.

భావనా మాత్రంగానే ఆమె అనిర్వచనీయ ఆనందాన్ని పొందింది.

ఆ ఆనందంలో ఆమెకు మళ్లీ వొకసారి తను పెంచిన మేకనుచూచుకోవాలనిపించింది.

లేచి వాకిట్లో కి రాబోతుంటే మందలో మేకల అరుపులు విన్పించాయి.

తనమేకను, మందల దొడ్లో గాక, విడిగా ప్రత్యేకంగా తయారు చేసిన వొక ప్రదేశంలో కట్తోంది నూకాలమ్మ.

ఆవైపు చూచిందామె.

అక్కడ...అక్కడ..

రెండు కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి.

"మే...మే...' మేక.ఆర్తనాదాన్ని వింటోంది.

"పులి... పులి...' పెద్దగా అరిచింది నూకాలమ్మ. ఆ క్షణంలో గూడెం మేలుకొంది.

కానీ సరిగ్గా అప్పుడే -

పులి మేకమెడను నోటితో పట్టేసుకొంది.

ఆదృశ్యాన్ని చూచినూకాలు సర్వస్వాన్ని మర్చిపోయింది. అమ్మవారేసాక్షాత్తు పూనిన దానిలా వీరావేశంతో వూగిపోయింది.

వొక్క దూకు దూకి పులిమీదికి లంఘించింది.

పులిని కింద పడేసి, నోట్లో వున్న మేకను లాక్కొంది.

అప్పటికే గూడెంలో జనం అక్కడ మూగేరు. పులిని తరమటానికి రకరకాల శబ్దాలు చేయసాగేరు.

అపరకాళిలా వూగిపోతూ నూకాలు పులి పొట్టను తలతో కుమ్మింది. ఎగిసి కాళ్ళతో తన్నింది.

పులి గాండ్రిస్తూ తోకముడిచి పోసాగింది.

కానీ నూకాలమ్మ పులిని వదల్లేదు.

పులిని అడివిలోకి తరిమి తరిమి కొట్టింది.

✡ ✡ ✡

నెలలు గడిచిపోయాయి.

సంబరం విశేషాలను గూడెం వాళ్లు ఎప్పుడో మర్చిపోయారు.

కానీ నూకాలు సాహసాన్ని గురించి మాత్రం యిప్పటికీ చెప్పుకొంటూనేవున్నారు.

సాదాసీదాగా అందరు ఆడవాళ్ళలా వుండే నూకాలుకు పులితో పోరాడగలిగే ధైర్యం ఎలావచ్చినట్లు? పోరాడి జయించగల శక్తి ఎక్కడి నుంచివచ్చినట్లు?

'ఆ రోజు పులితో నువ్వు పోట్లాడతావుండే అచ్చు అమ్మోరిలాగేవున్నావే? అప్పుడు నిన్ను సూత్తంటే నాకే బయమేసింది. పులి పారిపోయిందంటే పారిపోదూ? అంతబలం నీకేడనుంచి వచ్చిందే?'

నూకాలుక్కూడా అంతుబట్టని విషయం అదే!

కానీ ఆ రోజు మాత్రం ఆమె పులిని తరిమి కొట్టినందుకు సంతోషించలేదు. అమ్మోరి ఏటకు సిద్ధం చేసుకోన్న తన మేకను రక్షించుకోగలిగినందుకు సంతోషించింది.

"అంతా అమ్మోరి దయ. నాదేముంది.?' అంది.

మర్నాడు భక్తిశ్రద్ధలతో అమ్మోరికి మేకను ఏటగా సమర్పించుకొంది. అప్పటి నుంచి తన కోరికలు రెండూ ఎప్పుడెప్పుడు తీరుతాయా అని ఎదురు చూడసాగింది.

'నూకాలూ, నీ దయిర్యాన్ని సాగసాన్ని నాయకుడు కూడా పొగిడేడే. సదూకున్నోళ్లు నిన్ను సూడటానికి యియాళ రాత్తిరికి వత్తారంట. రగస్సెం. ఎవ్వరికీ సెప్పమాక' అంటూ యీరన్న పొద్దున్నే సెప్పివెళ్లిపోయాడు.

వాళ్లెవరో వస్తారని ఎదురుచూస్తూ కూర్చోలేదు నూకాలు.

తన కోరికల్లో వొకటి తీరేరోజు దగ్గరికొచ్చినట్లు ఆమెకు కొన్ని రోజులుగా అనుమానంగా వుంది. ఆ అనుమానాన్ని ఆరోజు ఖాయం చేసుకోవాలనుకొంది.

పురుళ్లు పోయటంలో అనుభవంవున్న వొక స్త్రీని కల్సింది.

'పులిలాంటి కూన పుట్టబోతున్నదే నూకాలూ నీకు' అందామె.

అంతే, ఆనందం పట్టలేక గూడెమంతా తిరిగి ప్రతిమనిషికి ఆవార్త చెప్పింది.

'అమ్మోరికి మొక్కుకున్నాను. ఏటనిచ్చాను. కనికరించిందితల్లి'

అందరితో అదేమాట. అయినా తనివి తీరలేదు.

భర్తరావాలి. అతనితో ఆనందాన్ని పంచుకోవాలి.

గూడెం అంతా నిద్రపోయాక వచ్చాడు యీరన్న. అతన్తోపాటు సదుకొన్న యిప్లవ గుంపు కూడా వచ్చింది.

'పులితో పోరాడి మేకను రక్షించిన నీకు నా విప్లవాభినందనలు కామ్రేడ్. పులిని తరిమి కొట్టేవని తెల్సింది. సంతోషించాం. కానీ కామ్రేడ్, నువ్విప్పుడు తరిమికొట్టాల్సింది ఆ పులుల్ని కాదు. నిన్ను మేకను చేసిబలిచేస్తున్న మానవ పులులను. మేకల్లాంటి మీరు తిరగబడ్తే పులులే పారిపోతాయని రుజువు చేసేవుకదా? యిక పులి తోలు కప్పుకొన్న యీ డబ్బు మను

ష్యలొాక లెక్కా? జమా? మా పోరాటంలో నువ్వు చేరాలి కామ్రేడ్. నిన్ను ఉపదళ నాయకు రాలిని చేస్తాం.'

దళనాయకుడు చెప్తున్న వొక్కమాట ఆమెకు అర్ధంకాలేదు. అర్ధం చేసుకోటానికి ప్రయత్నించలేదు కూడా.

'యింకొక్క విషయం కామ్రేడ్, పులి నోట్లో నుంచి మేకను లాక్కొని దాన్ని నువ్వేం చేసేవ్. అమ్మోరికి ఏటగా బలిచ్చావ్. అవునా? అది అజ్ఞానం, మూర్ఖత్వం."

'లేకపోతే కూరొండి మీకు యిందు సెయ్యాలా? కళ్లుపేలిపోతాయ్. అమ్మోరినేమీ అనకండి. అమ్మోరికి మేకనిచ్చాన్నేను. కానీ అమ్మోరు నాకేమిచ్చిందో తెలుసా! కూనను' గర్వంగా చెప్పింది నూకాలు.

'అమ్మోరు... మహత్యం... యిది మరొక అజ్ఞానం కామ్రేడ్. ఆరాయి అమ్మోరు కాదు. అమ్మోరు నీకు కూననివ్వలేదు. అసలు భగవంతుడే లేడు.'

'మీకున్నాడో లేదో నాకు తెలీదు. మాకున్నాడు దేముడు. మీరేదో పగల బొడుత్తారని ఆడినమ్మకం. అలాగే నాకు అమ్మోరి మీద నమ్మకం. అమ్మోరు నా కోరికను తీర్చింది. కనుక అమ్మోరే నాకు తల్లి. మీ మాటలు నా తలకెక్కవు. నా మాటలు తలకెక్కితే ఎక్కించుకోండి, అంతే!'

✡ ✡ ✡

అర్ధరాత్రి-

చదువుకున్నోళ్లతో కల్సి వీరన్న కీకారణ్యంలో వెళ్తున్నాడు.

వెనుక నుంచి హఠాత్తుగా పులి వచ్చి వీరన్న మెడపట్టుకుంది. వీరన్న గింజుకుంటున్నాడు. కానీ చదువుకున్నోళ్లు అతడిని రక్షించే ప్రయత్నం చెయ్యలేదు.

భయంతో పారిపోయారు. చెట్లచాటున నక్కి పులిపైకి తుపాకులు ఎక్కుపెట్టారు.

పులిని కాలిస్తే పులితో పాటు వీరన్న కూడా చస్తాడు.

వీరన్న రెండు చేతులెత్తి రక్షించమన్నట్లు దణ్ణం పెట్టేడు.

కానీ వారు కనికరించలేదు. తుపాకిని కాల్చారు.

ఆ గుండు వీరన్నకు తగిలింది. ఆ పులి అతడిని వదిలేసింది. కానీ లాభం ఏమిటి? అప్పటికే అతను చచ్చిపోయాడు. పారిపోబోతున్న పులిపై తుపాకిగుండ్ల వర్షం కురిపించి దాన్ని చంపేసేరు.

'అమ్మో' అంటూ ఉలిక్కిపడి లేచింది నూకాలు.

పక్కనే మెల్లగా గురకవినిపిస్తోంది.

'సీ... పీడకల' అనుకొంది.

తన మొదటి కోరిక తీరబోతొంది. రెండో కోరికను కూడా తీర్చుకోవాలి. వీరన్న వొట్టి అమాయకుడు. ఎవరేం చెప్తే అదినమ్ముతాడు.

నిన్నటిదాకా భూస్వాములకు భయపడ్డాడు. యివాళ భూస్వాములకు,

చదువుకున్నాళ్లకు, పోలీసులక్కూడా భయపడ్తున్నాడు. ఎలాగైనా ఆ రొంపి నుంచి లాగాలి.

వాకిట్లో మేకలు అవులు వొక్కసారిగా అరిచిన శబ్దం

మళ్లీ పులి రాలేదు కదా?

ఆమెవొక్క వుదుటున బయటకి పరుగెత్తింది.

సరిగ్గా అప్పుడే పులి మందలోని వొక లేగ దూడని పట్టుకుంది.

ఆలేగ దూడను పులితీసుకుపోతే భూస్వాములకు వీరన్న ఋణపడ్తాడు. ప్రోనోటు రాసిస్తాడు. కట్టుబానిసవుతాడు.

అమ్మో! చాలా పెద్ద నష్టం. దాన్ని తనుభరించలేదు.

'పులి.. పులి...' అమె పెద్దగా అరిచింది.

అప్పటికే పులి లేగదూడను నోటకర్చుకొని వెళ్ళబోతోంది.

అయినా నూకాలు వొక్క అడుగు ముందుకు వెయ్యలేదు.

'నూకాలూ... నూకాలూ... లేగదూడను లాక్కోవే. రక్షించవే. పులిని తరిమికొట్టవే' అప్పటికే అక్కడ మూగిన ఆడవాళ్లు అరిచారు. ఆమెను ముందుకు తోసేరు.

నూకాలు పులితో కలబడింది.

పులి లేగదూడను వదిలేసింది. భయంకరంగా గర్జిస్తూ నూకాలు పైకిదూకి పంజాతో వొక్క దెబ్బ కొట్టింది.

కిందబడ్డ నూకాలును నోటకర్చుకొని అడివిలోకి పారిపోయింది.

సగం తినేసిన ఆమె కళేబరం మర్నాడు అడివిలో కన్పించింది.

✡ ✡ ✡

రామం కధను ముగించి నిట్టూర్చాడు.

మిగతా ముగ్గురూ వొకరి మొహాలు ఒకరు చూచుకొన్నారు.

'విప్లవాన్ని కించపర్చే జానపదకధ ఇది. ఈ కధకు, మన చర్చనీయాంశానికి సంబంధమేమిటో నాకిప్పటికీ అర్థంకాలేదు.' అరుణ తీవ్రంగా అంది.

'నాకూ అర్థం కాలేదు. మేకను ఎత్తుకు పోతుండగా పులితో పోరాడిగెల్చిన హీరోయిన్ పులి లేగదూడను తీసుకుపోతుండగా ఎందుకు ఓడిపోయిందో? సగటు తెలుగు సినిమా యింతకన్నా 'రియలిస్టిక్' గా వుంటుందేమో!'

'రఘూ, నీ ప్రశ్నమంచిది. నీ కంక్లూజన్ మాత్రం అమాయకంగా వుంది. నీ ప్రశ్నకు సమాధానం ఆలోచించు. అది అర్థమయితే చర్చకు యీ కధకు సంబంధం కొంతవరకైనా బోధపడ్తుంది. ఏం రామం? యామ్ ఐ రైట్?' స్వప్నఅంది.

'మళ్లీ రామం ఎందుకు? ఆ సమాధానంఏదో నువ్వేచెప్పరాదూ?' అరుణ అంది రోషంగా.

'మేకపట్ల నూకాలుకు వొక 'కమిట్‌మెంట్' వుంది. అంటే , ఆమె దృష్టిలో ఆ మేక

కేవలం అన్ని మేకల్లాంటిది కాదు. అమ్మోరికి ఉపయోగపడబోయే వొక పవిత్రజీవి. అమ్మోరికి ఆ మేకను వేటగా యిస్తే తన కోరికల్ని తీరుస్తుందన్న విశ్వాసం వుంది. అందుకే ఆ మేకలో అమ్మోరిని చూచుకొందామె. కనుకనే పులినోట్లో ఆమేకను చూడగానే ఆమెకు అమ్మోరు ఆవహించినట్లయింది. ఎక్కడ లేని పిచ్చిబలం వచ్చింది. చుట్టూ వున్న ప్రపంచాన్నే మర్చిపోయింది. అందుకే పులినోట్లో నుంచి మేకను లాక్కోగలిగింది. పులిని తరిమికొట్టగలిగింది. కానీ రెండో సారి లేగదూడపట్ల ఆమెకా 'కమిట్‌మెంట్' లేదు. లేగదూడ లేగదూడగానే కన్పించింది. దాన్ని పులి ఎత్తుకుపోతే రాగల ఆర్థిక నష్టాలే గుర్తుకొచ్చాయి. విశ్వాస బలం లేకుండా కేవలం నూకాలు గానే పులితో పోరాటానికి సిద్ధమయింది. కనుక పులివిజృంభించింది. నూకాలు ప్రాణాలు కోల్పోయింది.'

'థాంక్యూ స్వప్నా.' ఆరాధనగా ఆమె వైపు చూస్తూ అన్నాడు రామం. అతనికి తెలీకుండానే ఆమె చేతుల్ని తనచేతుల్లోకి తీసుకొన్నాడు.

'యిప్పుడు నీ దృష్టిలో దేశరక్షణకు అత్యంత అవసరమైన చర్య ఏమిటో నన్ను చెప్పమంటావా?' రఘు అడగేడు.

'నేను చెప్తాను. దేశరక్షణకు అత్యంత అవసరమైనది దేశం పట్ల కమ్మిట్‌మెంట్. ప్రజలందరిలో దేశభక్తి పెంపుదల. యిది నాదేశం, యిది నాజాతి, దీన్ని నేను ప్రాణత్యాగం చేసైనా సరే రక్షించుకోవాలన్న కమ్మిట్‌మెంట్‌ను అన్ని మతాల వారిలోను, కులాలు, తెగలు, పార్టీలు, పక్షాల వారిలోనూ పెంచటం. దేశ భక్తి పెరిగితే మనపైన మనకి విశ్వాసం పెరుగుతుంది. ఎన్ని బలాలున్నా విశ్వాసానికి మించిన బలం లేదు. అవునా రామం. యిదేగా నువ్వు నీ కథ ద్వారా చెప్పదల్చుకొన్నది.' అరుణ చెప్పింది.

నవ్వి తల ఊపేడు రామం.

'నీ హేతు వాదానికి జోహార్ రామం. నీ అభిప్రాయంతో మేంముగ్గురం ఏకీభవిస్తాం. కానీ నువ్వో పని చెయ్యాలి'

'ఏమిటి?'

'నువ్వు, స్వప్న అలా జీవితాంతం వొకరి చేతులు వొకరు పట్టుకొని నడవాలి. ఎందుకంటే మీ యిద్దరి వేవ్ లెంగ్త్ వొక్కటేనని యివాళ స్వప్న ప్రూవ్ చేసింది. మీరిద్దరూ వొక్కటైతే మీ బలం పెరుగుతుంది. కదూ?'

"మరి మీరిద్దరూ?" అంటూ స్వప్న చెయ్యిని మృదువుగా నొక్కాడు రామం.

జాగృతి ఫాస్ట్‌ఫుడ్ ప్రత్యేకసంచిక 23-29, జూలై.1990